కరెంట్ సమస్యపై కౌన్సిలర్ వినతి



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ ఉమానాగరాజు

మేడ్చల్: వార్డులో నెలకున్న కరెంట్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మేడ్చల్ మున్సిపాలిటీ 16వ వార్డు కౌన్సిలర్ ఉమానాగరాజు విద్యుత్ ఏఈ శశిధర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వార్డు పరిధిలో పూర్తిగా లోఓల్టేజీ సమస్య ఏర్పడిందని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. రికండక్టింగ్ వైర్లు మార్చాలని, అవసరమైన చోట నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. అత్వెల్లి పరిధిలోని రెండోవార్డులో లోఓల్టేజీ సమస్య ఏర్పడిందని, దీనిని పరిష్కరించాలని వార్డు ప్రజలు రూరల్ ఏఈని కోరారు. వారం రోజులుగా సమస్య ఉన్నా అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పరిష్కరించడం లేదన్నారు. మండల అధికారులు పట్టించుకుని తమ సమస్యను తీర్చాలని కోరుతున్నారు.

విత్తనాలు కొనుగోలు చేస్తే రసీదులు తీసుకోవాలి



బండమాదారంలో రైతులకు సూచనలిస్తున్న అధికారులు

మేడ్చల్: విత్తనాలు కొనుగోలు చేసిన సమయాల్లో రైతులు తప్పకుండా రసీదులు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారులు కోరారు. మండలంలోని వివిధ గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. మండలంలోని బండమాదారం, పూడూర్, మునీరాబాద్ లింగాపూర్ తదితర గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి విత్తనాలపై అవగాహన కల్పించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో దుకాణం నుంచి తప్పకుండా రసీదు తీసుకోవాలని, విత్తన ప్యాకెట్, బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్త పరుచుకోవాలని, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. సమావేశాల్లో ఏఓ అర్చన, ఏఈఓలు సుమిత, తేజస్విని, ఆయా గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

క్రిమినల్ చట్టాలపై పోలీసులకు అవగాహన



సూచనలిస్తున్న డీసీపీ



హాజరైన పోలీసు అధికారులు

మేడ్చల్ రూరల్: నూతన క్రిమినల్ చట్టాలపై మేడ్చల్ పోలీసులకు అధికారులు అవగాహన కల్పించారు. ఈమేరకు ధ్రువ ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు జరిగింది. మేడ్చల్ డివిజన్ పరిధిలోని మేడ్చల్, సురారం, దుండిగల్, పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. చట్టంలో చేసిన మార్పులు, కొత్త చట్టాలు వంటి అంశాలను వివరించారు. సమావేశంలో మేడ్చల్ అడిషనల్ డీసీపీ నర్సింహ్మారెడ్డి, మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సత్యనారయణ, ఎస్ఐ మురళీధర్ మూడు పీఎస్‌ల సీఐలు, ఎస్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యంనంపేట్‌లో ఖాళీ జాగాపై వివాదం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఖాళీ జాగాపై వివాదం ఏర్పడింది. ప్రైవేటు వ్యక్తులు తమదని ఒకవైపు వాదిస్తుంటే.. మరోవైపు పోచారం మున్సిపాలిటీకే చెందుతుందని అధికారులు చెబుతున్నారు. యంనంపేట్‌లోని సర్వే నంబర్ 137, 138లో ఉన్న 29.34 ఎకరాల్లో 1979వ సంవత్సరంలోనే వెంకటేశ్వరనగర్ పేరుతో లేఔట్ చేశారు. ఇందులోని 8 వేల చదరపు గజాల ఖాళీ జాగాలో మూడేళ్ల కింద మున్సిపల్ కౌన్సిల్ తీర్మానంతో రూ. 8 లక్షలు వెచ్చించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి చెత్త డంపింగ్ చేస్తున్నారు. కానీ, ఈ స్థలం తనదేనని పోలగోని రాజేందర్‌గౌడ్ మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తన వద్ద ఉన్న డాక్యుమెంట్లను అందజేశారు. ఖాళీగా ఉన్న ఆ జాగాను తాత్కాలికంగా డంపింగ్ కోసం వాడుకుంటున్నామని, త్వరలోనే తీసేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఇటీవల ఈ డంపింగ్ యార్డులో మరిన్ని నిర్మాణాలు చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయడంతో రాజేందర్‌గౌడ్ అప్రమత్తమయ్యారు. డంపింగ్ యార్డులోకి చెత్త వాహనాలు రాకుండా అడ్డుకున్నారు. దీంతో మున్సిపల్ అధికారులు స్పందించి డంపింగ్ యార్డును ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు తరలిస్తామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారు. ఇటీవల కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు సదరు వివాదాస్పదస్థలంలో చెత్తను డంప్ చేయడం లేదు. ఈ క్రమంలో ఈ నెల 24న వివాదాస్పదస్థలంలో మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను రాజేందర్‌గౌడ్ తొలగించి ఈ స్థలం తనదేనని తెలియజేస్తూ ఫోన్ నంబర్లతోసహా బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో ఫెన్సింగ్ తొలగించినవారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోచారం పోలీస్‌స్టేషన్‌లో కమిషనర్ వేమన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



వివాదాస్పద స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

ఉంటాయా.. పోతాయా..



- మేడ్చల్ జిల్లాలో స్థానిక సంస్థల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- జిల్లాలోని 80 శాతం భాగం హైదరాబాద్ నగరంలోనే..
- సిటీలోనే మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు

మేడ్చల్: నగరానికి ఆనుకున్న మేడ్చల్ జిల్లాలోని స్థానిక సంస్థల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. హైదరాబాద్ మహానగరాన్ని చుట్టుపక్కల గ్రామాలు, మున్సిపాలిటీలతో కలిపి మరింత విస్తరించి దేశంలోనే ఢిల్లీ, ముంబై నగరాల మాదిరిగా మరింత గ్రేటర్ సిటీగా మార్చే యోచనలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఉండటమే దీనికి కారణం. జిల్లాలో మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్, మల్కాజ్‌గిరి, కూకట్‌పల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. ఉప్పల్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి నియోజకవర్గాలు పూర్తిగా జీహెచ్ఎంసీ పాలన పరిధిలో ఉండగా కుత్బుల్లాపూర్ సగం జీహెచ్ఎంసీ పరిధిలో, సగం స్థానిక సంస్థల పరిపాలనలో ఉంది. మేడ్చల్ నియోజకవర్గం మొత్తంగా స్థానిక సంస్థల పరిధిలో ఉంది. మేడ్చల్, కుత్బుల్లాపూర్ స్థానిక సంస్థల పరిధిలో ఉన్న నియోజకవర్గాలోని సగం ప్రాంతాలు హైదరాబాద్ నగరంతో కలిసే ఉన్నాయి. మేడ్చల్ నియోజకవర్గంలో మండలాలు గ్రామీణ వాతావరణంలో ఉన్న మిగతా ప్రాంతమంతా పట్టణ ప్రాంతంగా ఉండటంతో జీహెచ్ఎంసీకి చేరువగా ఉన్నాయి.

గ్రామాలు, మున్సిపాలిటీలు ప్రశ్నార్థకం

జిల్లాలో మేడ్చల్ నియోజకవర్గంలో 61 గ్రామ పంచాయతీలు, జవహర్‌నగర్, ఫీర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లు, మేడ్చల్, తూంకుంట, దమ్మాయిగూడ, నాగారం, ఘట్‌కేసర్, పోచారం, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. మేడ్చల్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలు మినహా మిగతా మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు అన్నీ ఔటర్‌రింగు రోడ్డు లోపలి భాగంలో ఉన్నాయి. ప్రభుత్వం హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ఓఆర్ఆర్ వరకు జీహెచ్ఎంసీ పరిధిని విస్తరించాలని ఆలోచనలో ఉండటంతో స్థానిక సంస్థలు ఉంటాయా.. పోతాయా.. అనే చర్చ జిల్లాలో జోరుగా సాగుతున్నాయి.

ఐదుగురికి జిల్లా పరిషత్...

మేడ్చల్, ఘట్‌కేసర్, కీసర, శామీర్‌పేట్, మూడు చింతలపల్లి మండలాలతో ఐదు జెడ్పీటీసీలతో జిల్లా పరిషత్ ఏర్పడింది. దీంతో జిల్లా పరిషత్ ప్రభావం పెద్దగా లేకుండా పోయింది. జిల్లా పరిషత్ జిల్లాలో నామమాత్రంగా మారిపోయింది. పేరుకు పెద్ద జిల్లా అయినా కేవలం ఐదుగురు జెడ్పీటీసీలతో అందులో ఒకరు చైర్మన్, మరొకరు వైస్ చైర్మన్ పోగా కేవలం ముగ్గురు సభ్యులతో నామమాత్రంగా మారిపోయింది. గతంలో 20 నుంచి 25 మంది వరకు ఎంపీటీసీ సభ్యులతో మండల పరిషత్ ఉండేది. తాజాగా 10 మందితో మండల పరిషత్ నడుస్తుంది. నామమాత్రంగా మారి రాజకీయ పార్టీల నాయకుల నిరుద్యోగ సమస్యను తీర్చే ఉద్యోగ వనరులుగా మారాయి.

గతంలో మాదిరిగానే...

20 ఏళ్ల క్రితం ప్రస్తుతం మేడ్చల్ జిల్లాగా ఉన్నా నియోజకవర్గాలు మున్సిపాలిటీలుగా ఉండేవి. ఉప్పల్, కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి, కూకట్‌పల్లి, కాప్రా నగర శివార్లలో మున్సిపాలిటీలుగా ఉండేవి. నగరం పెరగడంతో వాటిని నాటి ప్రభుత్వాలు జీహెచ్ఎంసీలో విలీనం చేశాయి. తాజాగా నగరం శరవేగంగా విస్తీర్ణం చెంది, మేడ్చల్ జిల్లా వైపు కాంక్రీట్ జంగిల్‌గా మారింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు నగర వాతావరణంలో ఉండి నగరంలోనే మిళితమై కనిపిస్తున్నాయి.

చిన్న గ్రామాలుగా గ్రామ పంచాయతీలు

గ్రామ పంచాయతీల పుర్విభజన చేయడంతో కేవలం 500 నుంచి 800 జనాభా ఉన్న గ్రామాలు గ్రామపంచాయతీలుగా మారాయి. ఇతర ఆదాయాలు శూన్యంగా ఉన్నా పేరుకు గ్రామపంచాయతీలుగా ఉన్నా అభివృద్ధి ఆమడదూరంలో నడుస్తున్నాయి. జిల్లాలో మేడ్చల్ నియోజకవర్గంలో మాత్రమే 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

మున్సిపాలిటీలుగా గ్రామాలు

కేవలం జిల్లాలో రెవెన్యూ మండలాలు ఉంచి మిగతా మండల పరిషత్, జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీలను పూర్తిగా రద్దు చేసి మున్సిపాలిటీలను మార్చే యోచనలో ప్రభుత్వం ఉందని అన్ని రాజకీయ పార్టీల నాయకులు చెబుతున్నారు. ప్రస్తుత మున్సిపాలిటీల సమీప గ్రామాలను వాటిలో విలీనం చేసి జీహెచ్ఎంసీలో కలపడం, ఔటర్‌కు దూరంగా ఉన్న గ్రామాలను పెద్ద గ్రామంలో కలిపి ప్రత్యేక మున్సిపాలిటీని ఏర్పాటు చేసి పాలన సాగించడం వంటి సాధ్యాసాధ్యాలపై అధికారులు అంతర్గతంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. కేవలం జిల్లాలో రెండు, మూడు మున్సిపాలిటీలు ఉంచి మిగతా ప్రాంతాలను జీహెచ్ఎంసీలో విలీనం చేసి హైదరాబాద్ మహానగరాన్ని విస్తరించే యోచనలో ప్రభుత్వ పెద్దలు కనిపిస్తుండటంతో రాబోయే స్థానిక సంస్థల పోరు మేడ్చల్ జిల్లాలో ఉంటుందో, పోతుందో అనే చర్చలు మేడ్చల్‌లో జోరుగా సాగుతున్నాయి. ఇప్పటివరకు మేడ్చల్ జిల్లా హైదరాబాద్ నగరంలో అంతర్భాగం ఉన్నా రాబోయే రోజుల్లో జిల్లా హైదరాబాద్‌లో విలీనం కావడం అనివార్యంగా కనిపిస్తుంది.

గొలుసు దొంగల అరెస్ట్



ప్రశాంత్



సాయికమల్

పోచారం: మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన దొంగలను పోచారం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ నెల 23న అన్నోజిగూడ ఫ్లైఓవర్‌పై యాక్టివా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న శ్రీజ మెడలో గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు లాక్కెళ్లారు. ఈ నెల 28న యంనంపేట్‌లోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా పై ఘటనకు పాల్పడిన వ్యక్తులు పోలీసులకు చిక్కారు. నిందితులను చేనుమల్ల ప్రశాంత్(32), దండిగన్ సాయికమల్ (32)గా గుర్తించారు. వీరి వద్ద లభించిన 10 గ్రాముల బంగారు గొలుసు, యూనికార్న్ మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని, వారిని కోర్టు ద్వారా రిమాండ్ చేశారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



విత్తనవిక్రయ కేంద్రం పరిశీలిస్తున్న మేరీ రేఖ

కీసర: వ్యవసాయ శాఖ ప్రతి వానాకాలం రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి మేరీ రేఖ అన్నారు. బుధవారం కీసరలో విత్తన విక్రయకేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట పైరుతో చేనుకు చేవ, రైతుకు లాభదాయకమన్నారు. గత ఏడాది కన్నా ఈయేడు ఎక్కువ విత్తనాలను రైతుల వినియోగం కోసం జిల్లాలో అందుబాటులో ఉంచామన్నారు. ఈ విత్తనాలను పీఏసీఎస్, ఎఫ్ఎస్‌సీఎస్ ద్వారా రైతులకు అందజేయస్తున్నట్లు చెప్పారు. 2024-25వ సంవత్సరంలో 347 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచితే ఇప్పటివరకు 291 క్వింటాళ్లు అమ్ముడుపోగా 56 క్వింటాళ్లు మిగిలాయన్నారు. విత్తనాలు కావాల్సిన వారు స్థానిక వ్యవసాయాధికారిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఏఓ వందన, రాజు పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయంలో చోరీ

పోచారం: దుర్గామాత ఆలయంలో చోరీ జరిగింది. పోచారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు... చౌదరిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని దుర్గామాత గుడిలో గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగలగొట్టి అందులోని నగదు, అమ్మవారిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించారు. స్థానికులు బుధవారం ఉదయం గమనించి ఆలయంలో చోరీ జరిగిన విషయాన్ని నిర్వాహకులకు తెలియజేశారు. నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'విత్తనాల సరఫరాలో సర్కారు విఫలం'

ఘట్‌కేసర్: రైతులకు వానాకాలం పంటలకు అవసరమైన విత్తనాలు సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, విత్తనాల కోసం లైన్‌లో నిలబడిన రైతులపై లాఠీ చార్జ్ చేయడం సిగ్గేచేటని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన దిగుబడులు కొనుగోలు చేయకుండా ధాన్యం దళారుల పాలు చేయడానికి మిల్లర్లతో కుమ్మక్కైయ్యారని విమర్శించారు.

మెరుగైన వైద్యం అందించాలి: ఎంపీపీ



అవుషాపూర్ దవాఖానాలో వివరాలు తెలుసుకుంటున్న సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం అవుషాపూర్ పల్లె దవాఖానాను సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులు, ఆశ వర్కర్ల పనితీరు, ఆస్పత్రిలో సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సమస్యలుంటే తెలపాలన్నారు. గతంలో విద్యుత్ సమస్యను పరిష్కరించిన విషయాన్ని గుర్తుచేశారు.

రాష్ట్ర అవతరణ వేడుకల పనులను వేగవంతం చేయాలి



అధికారులతో సమావేశమైన కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి

జవహర్‌నగర్: రాష్ట్ర అవతరణ దినోత్సవం ఏర్పాట్ల కొరకు బుధవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 2వ తేదీన నిర్వహించే రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని, పనులు వేగవంతం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వో ప్రభాకర్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, సంగీత, శ్రీదేవి, రజిని తదితరులు పాల్గొన్నారు.

'విలీనంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు అందలేదు...'

ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లాలో ఓఆర్ఆర్ లోపలి గ్రామాలను హైదరాబాద్ జీహెచ్ఎంసీలో, బయట ఉన్న గ్రామాలను మున్సిపాలిటీలుగా చేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తుంది. గత సంవత్సరం ఓ వ్యక్తి ప్రజాభవన్‌లో జరిగే ప్రజావాణిలో ఓఆర్ఆర్ లోపల ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్, చౌదరిగూడ, కొర్రెముల్, ప్రతాపసింగారం, కాచవానిసింగారం, కీసర మండలం చీర్యాల్, గోధుమకుంట, కరీంగూడ, తిమ్మాయిపల్లి, నర్సంపల్లి గ్రామాల సమాచారం కోరాడు. అతడి విన్నపం మేరకు తెలంగాణ మున్సిపల్ శాఖ ఆయా మండల పరిధిలోని గ్రామాల ఆర్థిక స్థితిగతులు, విస్తీర్ణం, ఆదాయ వ్యయాలు, జనాభా తదితర వివరాలను అందజేయాలని డీపీఓ ద్వారా ఎంపీడీఓలకు ఆదేశాలు వచ్చాయి. ఓఆర్ఆర్ లోపలి గ్రామాల విలీనం, స్థితిగతులపై ఎంపీడీఓ రవిని వివరణ కోరగా ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు అందలేదన్నారు.

బీటెక్ విద్యార్థి ల్యాప్‌టాప్ చోరీ

ఘట్‌కేసర్: ఓ బీటెక్ విద్యార్థికి చెందిన ల్యాప్‌టాప్‌ను గుర్తుతెలియని దుండగుడు ఎత్తుకెళ్లిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు మాదారం గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి గోలీ సూర్యవంశీ(20) ఘట్‌కేసర్‌లోని శివాస్ హాస్టల్ ఉంటున్నాడు. మంగళవారం హెచ్‌పీ ఓమెన్ ల్యాప్‌టాప్‌లో ప్రాజెక్టు పని పూర్తి చేసి బెడ్‌పై పెట్టి నిద్రపోయాడు. అనంతరం మేల్కొని చూసేసరికి ల్యాప్‌టాప్ కనిపించలేదు. హాస్టల్‌లో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనుమతిలేని కళాశాలను సీజ్ చేయాలి

డీఐఈఓ ఎదుట ఏఐవైఎఫ్ జిల్లా సమితి ధర్నా... వినతిపత్రం అందజేత



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఇంటర్ బోర్డ్‌ను మోసం చేస్తున్న విజ్ఞాన్ వేదాంత్ కళాశాలను సీజ్ చేయాలని, మల్టీ ఆక్యుపెన్సీ వ్యాపార భవన సముదాయాలలో అనధికారికంగా నడుస్తున్న ఈ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీఐఈఓ ఎదుట విద్యార్థులు, యువజన కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అనంతరం మేడ్చల్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి(డీఐఈఓ) కిషన్‌కు వినతిపత్రం అందజేశారు. కళాశాలలకు బోర్డు అనుమతులు లేకున్నా.. అడ్మిషన్లు నిర్వహించడం చట్టవిరుద్ధమని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఇంటర్ బోర్డ్ రాష్ట్రవ్యాప్తంగా 432 మల్టీ ఆక్యుపెన్సీ వ్యాపార భవన సముదాయాలలో నడుస్తున్న కళాశాలలకు అనుమతులు ఇవ్వలేదని, ఈ విజ్ఞాన్ కళాశాల కూడా బహుళ వ్యాపార సముదాయంలో, ఫైర్ సేఫ్టీ అనుమతులు లేకుండానే నడుస్తున్నదని ఆరోపించారు. ఇంటర్ బోర్డ్ అధికారులు తక్షణమే విజ్ఞాన్ కళాశాలను సీజ్ చేసి, విద్యార్థులు కళాశాల యాజమాన్యానికి కట్టిన ఫీజులను వాపసు చేయాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, మురళి, కిరణ్, మహేష్ పాల్గొన్నారు.

'ప్లాన్'టేషన్..

- ఈ ఏడాదిలో 39.27 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక ఖరారు
- హరితహారంలో భాగంగా పచ్చదనం పెంచటమే లక్ష్యం
- మేడ్చల్ జిల్లాలో 71 నర్సరీల్లో పెరుగుతున్న 45 లక్షల మొక్కలు
- వర్షాలు పడగానే.. మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం



సాక్షి, మేడ్చల్ జిల్లా: పచ్చదనం పెంపు దిశగా అధికారయంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. వర్షాలు కురిసిన తరువాత మొక్కలు నాటేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందుబాటులో ఉన్న నర్సరీల్లో మొక్కల సంరక్షణ బాధ్యతలు పర్యవేక్షిస్తూనే.. కొత్తగా అవెన్యూ ప్లాంటేషన్‌సహా ఇతర ఖాళీ ప్రదేశాలను గుర్తిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖల పర్యవేక్షణలో 2024లో నాటాల్సిన లక్ష్యాల్ని నిర్దేశించారు.

సిద్ధంగా మొక్కలు

జిల్లాలోని నర్సరీల్లో 45 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. జిల్లాలో ఈ ఏడాదిలో 39.27 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. దీనికి తగ్గట్టుగానే అటవీ శాఖ తూముకుంట, కండ్లకోయ, దూలపల్లిల్లోని మూడు నర్సరీల్లో 8 లక్షల మొక్కలను పెంచగా, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్డీఏ) ఆధ్వర్యంలో 58 గ్రామాల్లోని నర్సరీల్లో 20 లక్షల మొక్కలు, 13 పురపాలక సంఘాలలోని నర్సరీల్లో 17 లక్షల మొక్కలను పెంచారు. ఈ ఏడాది గతంలోని మొక్కలతోపాటు టేకు, ఈత, వెదురు, మలబార్, ఇప్ప, మద్ది, వెలగ, మర్రి, వేప, రేల, బాదాం, రావి, చింత, తులసి, నిమ్మ, జామ, సీతాఫలం, ఖర్జూర, మందార, సన్నజాజి, మల్లె నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మొక్కల సంరక్షణేదీ..!

2023 సంవత్సరంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా 63.90 లక్షల మొక్కలు నాటితే అందులో 90 శాతం బతికినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో 85-80 శాతం మొక్కలు ఎదిగాయని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. కానీ, కాగితాల్లోనే మొక్కల లెక్కలు పక్కాగా ఉంటున్నా క్షేత్రస్థాయిలో అనుకున్న పురోగతి లేదనేది ఆయా ప్రాంతాలను పరిశీలిస్తే తెలుస్తోంది. పలు సమావేశాల్లోనూ ప్రజాప్రతినిధులు హరితహారానికి సంబంధించి కాగితాల్లోని లెక్కలకు క్షేత్రస్థాయిలో వాస్తవాలకు వ్యత్యాసముందనే ఆరోపణలు చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 2016లో మొదలైన ఈ కార్యక్రమం ఏటా సాగుతోంది. ఇప్పటివరకు జిల్లాలో దాదాపు 5 కోట్ల మొక్కలు నాటినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే రోడ్ల పక్కన నాటిన మొక్కలు సంరక్షణ లేకపోవడంతో ఎండిపోతున్నాయి. దీంతో మరుసటి ఏడాది అదే చోట మొక్కలను నాటుతున్నారు. ఆయా శాఖలవారీగా లక్ష్యాలను కేటాయించినప్పటికీ, వాటిని సంరక్షించే విషయాన్ని విస్మరిస్తున్నారు. ఎక్కువ లక్ష్యాన్ని పెట్టి ఆదరాబాదరగా మొక్కలు నాటే తంతును ముగించే కన్నా.. తక్కువ మొత్తంగా లక్ష్యాన్ని ఇచ్చి.. నాటిని ప్రతి మొక్కను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్రస్థాయి అధికారులు జిల్లాలకు ఆదేశాలిచ్చారు.

అన్యాక్రాంతం కాకుండా..

జిల్లాలో భూముల విలువ ఆకాశానంటంతో ధరలు అందనంత దూరంలో పెరిగాయి. దీంతో ప్రభుత్వ, అసైన్డ్, అటవీ, చెరువు శిఖం భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. మరోవైపు ప్రభుత్వస్థలాలనూ అక్రమార్కులు వదలటం లేదు. వీటిని రక్షించేందుకు అవసరాల నిమిత్తం సేకరించిన భూముల్లో మొక్కలు నాటనున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక ప్రాంతాలలో కూడా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సామూహిక వనాల పెంపకానికి స్థలసేకరణలో ఆయా శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కూలీలు మొక్కలు నాటేందుకు గుంతల తవ్వకాల పనులు చేపడుతున్నారు. అర్బన్ పార్కులుసహా పట్టణాలు, గ్రామాల్లో గుంతల తవ్వకాల పనులు ముమ్మరంగా చేపడుతున్నారు.

మొక్కల లక్ష్యం ఇలా..

జిల్లాలో 13 పురపాలక సంఘాలు ఉండగా, హరితహారంలో భాగంగా బోడుప్పల్‌లో 3 లక్షల మొక్కలు, పీర్జాదిగూడలో 3.73 లక్షలు, జవహర్‌నగర్‌లో 3.49 లక్షలు, నిజాంపేటలో 3.76 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. మేడ్చల్‌లో 1.39 లక్షలు, పోచారంలో 71 వేలు, తూముకుంటలో 70 వేలు, దుండిగల్‌లో 2.21 లక్షలు, ఘట్కేసర్‌లో 74 వేలు, నాగారంలో 1.14 లక్షలు, దమ్మాయిగూడలో 1.68 లక్షలు, గుండ్ల పోచంపల్లిలో 1.50 లక్షలు, కొంపెల్లిలో 1.79 లక్షలు నాటాలని నిర్ణయించారు. కీసర మండలంలో 1.55 లక్షలు, శామీర్‌పేటలో 1.30 లక్షలు, ఎంసీపల్లిలో 1.66 లక్షలు, మేడ్చల్‌లో 1.70 లక్షలు, ఘట్కేసర్ మండలంలో 1.84 లక్షలు మొక్కలు నాటనున్నారు. మిగతా మొక్కలన్నీ జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్దేశించిన ప్రదేశాల్లో నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

- నగేష్‌గౌడ్‌ను అరెస్ట్ చేయాలని తుర్కపల్లి గ్రామస్తుల ధర్నా
- మహేందర్ సూసైడ్ సెల్ఫీ వీడియో వైరల్



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న తుర్కపల్లి గ్రామస్తులు

శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం తుర్కపల్లికి చెందిన రుద్రబోయిన మహేందర్(35) ఆత్మహత్యకు వడ్డీ వ్యాపారి దూడల నగేష్‌గౌడ్ వేధింపులే కారణమని, ఆయనను అరెస్ట్ చేయాలని బుధవారం బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున్న జినోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ ఎదుట, అనంతరం తుర్కపల్లిలోని కరీంనగర్- హైదరాబాద్ రాజీవ్ రహదారిపై బైఠాయించారు. తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబం డిమాండ్ చేసింది. అధిక వడ్డీ వల్లే చనిపోతున్నానని ఆత్మహత్యకు ముందు మహేందర్ తీసుకున్న సెల్ఫీ వీడియో వైరల్‌గా మారింది. నగేష్‌గౌడ్ వద్ద రూ.6 లక్షలు అప్పు తీసుకున్నానని, ఇందులో రూ. 4.70 లక్షలను దశలవారీగా చెల్లించినా కూడా తనను వేధిస్తున్నారని మహేందర్ వీడియోలో వివరించాడు. ఇంటికి తాళం పెడతానని, గ్రామంలో పరువు తీస్తానంటూ బెదిరించడంతో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని రాసిన సూసైడ్ నోట్‌తో పాటు సెల్ఫీ వీడియో మహేందర్ ఫోన్‌లో లభ్యమైంది. సెల్ఫీ వీడియో ఆధారంగా నగేష్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తానని సీఐ యాదయ్య హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.